

అనతి కాలంలోనే ప్రజల మన్ననలు చూరగొన్న వన్ నేషన్ దినపత్రికను చదవండి... చదివించండి....

# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 285 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 26-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-


వన్ నేషన్ దినపత్రికను ఆదరిస్తున్న పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు మా హార్థిక శుభాకాంక్షలు

## 27న సంగెం లక్ష్మీబాయమ్మ 115వ జయంతి ఉత్సవం

**నాగోల్, జులై 25 (వన్‌నేషన్):** ఈ నెల 27వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు సంతోష్‌నగర్, సైదాబాద్‌లోని సంగెం లక్ష్మీబాయమ్మ విద్యాపీఠం దగ్గర వినయ్ నగర్ కాలనీ లో 115వ జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**సంగెం లక్ష్మీబాయమ్మ సంక్షిప్త జీవిత వివరాలు తెలుసుకుందాం : (27.07.1911 - 03.06.1979)**

సంగెం లక్ష్మీబాయమ్మ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక సంస్కర్త, పార్లమెంట్ సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ నుండి లోక్ సభకు ఎన్నికైన మొట్ట మొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. ఘట్కేసర్ సమీపంలోని ఒక గ్రామంలో జన్మించిన ఆమె చిన్న వయసులోనే తల్లిదండ్రులను, భర్తను కోల్పోయి అనాథగా మిగిలారు. అయినప్పటికీ మద్రాసు ఆంధ్ర మహిళా సభ, కార్వే విశ్వవిద్యాలయం, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. విద్యార్థి దశలోనే సైమన్ కమిషన్ ను వ్యతిరేకించారు. 1930-31 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. **ప్రజా జీవితంలో ఆమె చేసిన సేవలు:** 1. 1952 లో బాన్సువాడ నుండి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు ఎన్నిక. 2. 1954-1956 వరకు రాష్ట్ర ఉప విద్యా మంత్రిగా సేవ. 3. 1957, 1962, 1967లో మెదక్ నుండి 2వ, 3వ, 4వ లోక్ సభలకు ఎన్నిక. మహిళలు, పిల్లల సంక్షేమే ఆమె జీవిత లక్ష్యం. 1952లో ఇందిరా సేవా సదన్ సొసైటీని స్థాపించి ఐ. ఎస్ సదన్ లో అనాథాశ్రమాన్ని ప్రారంభించారు. రాధిక మెటర్నిటీ హోమ్, వాసు శిశు విహార్, మాశెట్టి హనుమంతుగుప్త బాలికల ఉన్నత పాఠశాల స్థాపనలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణలో ఆచార్య వినోబా భావే గారి మొదటి పాదయాత్రకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మన ఆలోచన సాధన సమితి (మాస్ ) ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని మీడియా సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, వినయ్ కిషోర్ యాదవ్, వీరేందర్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, కొత్తకాపు రవీందర్, మాజీ కార్పొరేటర్ మధుకర్ రెడ్డి, కోట్ల శ్రీనివాస్ రావు, సంగం రాధిక, శ్రీనివాస్ యాదవ్, ఎన్. విష్ణు, మాణిక్ యాదవ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




1. కటకం నర్సింగ్ రావు వ్యవస్థాపక అధ్యక్షుడు, 2వినయ్ కిషోర్ యాదవ్ 3. వీరేందర్ యాదవ్ 4. బాలకృష్ణ గౌడ్ 5. కొత్తకాపు రవీందర్ 6. మధుకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ 7. కోట్ల శ్రీనివాసరావు, 8. సంగం రాధిక, 9. శ్రీనివాస్ యాదవ్, 10. ఎన్. విష్ణు, 11. మాణిక్ యాదవ్, 12. బ్రహ్మయ

## మోదీ దిగిపోయే సమయం వచ్చింది

**- విద్యార్థులు ధైర్యంగా నిలిచి పోరాడారు - దాడులపై మోదీ క్షమాపణ చెప్పాల్సిందే! - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, జులై 25 (వన్‌నేషన్):** దేశంలో విద్యావ్యవస్థ పునర్నిర్మాణం దిశగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో అడుగు పడిందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, మోదీ ప్రభుత్వాన్ని దింపేసే సమయం వచ్చిందని వ్యాఖ్యానించాయి. ప్రజల ముందు ప్రభుత్వం తల వంచాల్సిందేనని స్పష్టం చేశాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన దాడుల పట్ల ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేవలం ప్రారంభం మాత్రమేనని,

3లో

## విద్యార్థుల పోరాటానికి కేంద్రం దిగొచ్చింది

**- ప్రధాన్ రాజీనామాపై పలువురి హర్షం - ప్రజాస్వామ్యంలో నియంత పోకడలకు తావులేదని రుజువైంది : మహేష్ గౌడ్ - విద్యార్థి శక్తికి తలవంచిన కేంద్రం : కోదండరాం - విద్యార్థులకు సెల్యూట్: ఆర్.నారాయణమూర్తి**




**న్యూఢిల్లీ, జులై 25 (వన్‌నేషన్):** నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ నేతృత్వంలో విద్యార్థులు, యువత తెచ్చిన ఒత్తిడికి తలొగ్గి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయడంపై రాష్ట్రంలోని వివిధ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇది విద్యార్థి లోకం సాధించిన విజయమని పేర్కొన్నాయి. విద్యార్థులు, ప్రతిపక్షాలు చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్రజాస్వామ్యంలో నియంత పోకడలకు తావులేదని ఈ పోరాటం

4లో

## ఘనంగా 167వ ఆదాయపు పన్ను దినోత్సవం

**పన్ను చెల్లింపుదారుల సహకారమే దేశాభివృద్ధికి బలమైన పునాది : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్):** 167వ ఆదాయపు పన్ను దినోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, రోడ్ నెం.12లో ఉన్న అమరావతి ఆడిటోరియం, మెహదీ మంజిల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (CBDT) మాజీ చైర్మన్ శ్రీ కె.వి. చౌదరి గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్--తెలంగాణ ప్రాంత ప్రధాన ప్రధాన ఆదాయపు పన్ను కమిషనర్ శ్రీ సురేష్ బట్టిని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదాయపు పన్ను శాఖ డిజిటల్ పరివర్తన, పారదర్శక పాలన, పన్ను వసూళ్లలో సాధించిన పురోగతి, పన్ను చెల్లింపుదారులకు అందిస్తున్న సాంకేతిక ఆధారిత సేవలు, ఆదాయపు పన్ను చట్టం--2025 అమలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సాంకేతికతను మరింత

4లో

## సంజీవనితో ఇంటింటికీ ఆరోగ్య భద్రత..!!

**- ఆలూరు సభలో సీఎం చంద్రబాబు - స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కు పంపిణీ.. - సంజీవని ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం..**




**ఎమ్మిగనూరు, జులై 25 (వన్‌నేషన్):** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం "సంజీవని" ప్రాజెక్టును అమలు చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.కర్నూలు జిల్లా ఆలూరులో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో పాల్గొన్న ఆయన,స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల విలువైన ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.సీఎం అంటే కేవలం సచివాలయంలో ఉండే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే "కామన్ మ్యాన్" అనే భావనతో పనిచేస్తున్నానని చంద్రబాబు అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపడానికే ప్రతి నెలా జిల్లాల్లో పర్యటిస్తూ సంజీవని వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన గ్రామం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తామని ప్రకటించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్,క్యూరేటివ్ విధానాలతో ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి

2లో

# పేద ప్రజలకు ఆదివాసీ వర్గాలకు సహాయ సహకారాలు



**హైదరాబాద్, జూలై 25 (వన్ నేషన్):** పేద ప్రజలకు ఆదివాసీ వర్గాలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వరంగల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సిరిసిల్ల రాజయ్య అన్నారు. శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# కేంద్రం విమాన రాకపోక చార్జీలు తగ్గించాలి



**తిరుపతి, జూలై 25 (వన్ నేషన్):** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రానికి లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులు వస్తుంటారు వెళుతుంటారని వారి కోసం హైదరాబాదు నుండి తిరుపతికి వచ్చే విమాన రాకపోక చార్జీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఉయ్ కేర్ ఉయ్ రియాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కందనూరు జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి--హైదరాబాద్ విమాన చార్జీలు, దేశంలోనే మరింత దూరం ప్రయాణించే ఇతర విమాన మార్గాల కంటే కూడా ఎక్కువగా ఉంటున్నాయని బాధాకరమన్నారు. నిత్యం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుపతి--హైదరాబాద్ మార్గంలో అదనపు విమానాలను ప్రవేశపెట్టి, సీట్ల లభ్యతను పెంచి విమాన రాకపోక చార్జీలపై ఒత్తిడిని తగ్గించాలన్నారు. తద్వారా భక్తులకు, సాధారణ ప్రజలకు ఎంతో మేలు జరుగడమే కాకుండా, తిరుపతి పర్యాటక రంగం, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా గణనీయమైన ఊతం లభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కె పి రాహుల్, ఆర్ కరుణ, కే ఆదిత్య, కే చేతన్ కృష్ణ, ఎస్ హరీష్ పాల్గొన్నారు.

# మియాపూర్‌లో ఘనంగా ప్రారంభమైన టీలాజీ కేఫ్

## రుచికరమైన టీ, కాఫీతో పాటు విభిన్న ఫుడ్ వెరైటీలకు ఒకే చిరునామా



**హైదరాబాద్, జూలై 25 (వన్ నేషన్):** మియాపూర్‌లో ప్రముఖ టీ బ్రాండ్ టీలాజీ (Tealogy) కేఫ్ నూతన శాఖను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కేఫ్‌ను ప్రవీణ అల్లిమల్లి, యోగేష్ అల్లిమల్లి ప్రారంభించి, వినియోగదారులకు నాణ్యమైన రుచి, పరిశుభ్రమైన వాతావరణం, ఉత్తమ సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా వందలాది శాఖలతో విశ్వాసాన్ని సంపాదించుకున్న టీలాజీ కేఫ్ ఇప్పుడు మియాపూర్ ప్రజలకు కూడా అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయ కుల్హడ్ టీతో పాటు వివిధ రకాల టీలు, కాఫీలు, ఫిల్టర్ కాఫీ, కోల్డ్ కాఫీ, ఫ్రూట్ షేక్స్, చాక్లెట్ షేక్స్, ఐస్‌డ్ టీ, కూలర్స్ వంటి పానీయాలతో పాటు బన్ మస్కా, శాండ్‌విచ్‌లు, పిజ్జా, ఫ్రెంచ్ ఫ్రైస్, మగ్గీ, పోహా తదితర రుచికరమైన ఫుడ్ ఐటమ్స్‌ను ఒకే చోట అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి వంటకంలో నాణ్యత, పరిశుభ్రత, తాజాదనం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, కుటుంబ సభ్యులు, యువత, ఉద్యోగులు, స్నేహితులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడిపేందుకు ఈ కేఫ్ ప్రత్యేకంగా రూపొందించబడిందని యాజమాన్యం పేర్కొంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభ రోజున కేఫ్‌కు విశేష స్పందన లభించింది. భవిష్యత్తులో కూడా నాణ్యమైన సేవలతో వినియోగదారుల ఆదరణను మరింత పెంపొందించుకునే దిశగా కృషి చేస్తామని ప్రవీణ అల్లిమల్లి, యోగేష్ అల్లిమల్లి తెలిపారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు

**మల్కాజిగిరి, జూలై 25 (వన్ నేషన్):** మల్కాజిగిరి ఆనంద్ బాగ్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటఎరమణాచార్యులు స్వామి వారిని తులసీ, పూలతో అరటిపండ్లతో ఎంతో అత్యంత రమణీయంగా, అలంకరించారు. ఆషాడ శుద్ధ ఏకాదశి, శయన ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి ఉత్థాన ఏకాదశి వరకు చాతుర్మాసం(శ్రీ మహావిష్ణువు యోగనిద్రాకాలం) శయనకోలంలో సాలగ్రామ నారాయణుడిని దర్శనానికి తీర్చిదిద్దారు. అలాగేతొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలోని విశేష పుష్పాలంకరణలో శ్రీ సంకట విమోచన ఆంజనేయ స్వామి వారు దర్శనమిచ్చారు. తొలి ఏకాదశి పర్వదినాన మల్కాజిగిరి ప్రాంత ప్రజలంతా పెద్ద ఎత్తున స్వామివార్లను దర్శించుకున్నారు.

# ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నైషేధం సత్యనారాయణ మూర్తి నియామకం




**హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్):** ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. శనివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ సమావేశంలో ఫెడరేషన్ జాతీయ సెక్రెటరీ జనరల్ ద్రోణం రాజు రవికుమార్, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాదులు సత్యనారాయణమూర్తికి నిమ్మక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ద్రోణం రాజు రవికుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్‌కు భరోసా కల్పించేలా అల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధి కోసం బ్రాహ్మణ పరిషత్ కు రాష్ట్రప్రభుత్వం 100 కోట్ల రూపాయల వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి, వారికి జరుగుతున్న అన్యాయాలపై అల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నిరంతరం పోరాడు తోందని తెలిపారు. బ్రాహ్మణులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణలో బ్రాహ్మణులకు ఏ రాజకీయ పార్టీ కూడా సముచిత ప్రాధాన్యత కల్పించడం లేదని ద్రోణంరాజు రవికుమార్ విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 33 మంది బ్రాహ్మణ ఎమ్మెల్యేలు ఉండగా, ప్రస్తుతం తెలంగాణలో ఆ సంఖ్య ఒక్కరికే పరిమితమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ, తగిన నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని చెప్పారు. పేద బ్రాహ్మణుల అభివృద్ధి విద్యార్థులకు ఉన్నత విద్య కోసం నిధుల విడుదలకు పాటుపడతామని చెప్పారు ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన నైషదం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణ పరిషత్‌కు 500కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య కోసం ఏర్పాటు చేసిన వివేకానంద పథకాన్ని కొనసాగించాలని కోరారు. అలాగే ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం నాలుగు ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాలను కలుపుకొని తమ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి నారాయణ శర్మ, కార్యదర్శులు వారణాసి వంశీ, ఒక్క లంక శ్రీనివాసరావు, సభ్యులు ఆకెళ్ళ సుబ్బలక్ష్మి, జయ తులసి తదితరు పాల్గొన్నారు

# సంజీవనితో ఇంటింటికీ ఆరోగ్య భద్రత..!!

(1వ పేజీ తరువాయి)



కుటుంబానికి ఆభా హెల్త్ ఐడీ, హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ ఆరోగ్య రికార్డులు రూపొందించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే డిజిటల్ వ్యవస్థలో అనుసంధానం చేస్తామని వివరించారు.సంజీవని ద్వారా 41 రకాల ఉచిత పరీక్షలు, టెలీమెడిసిన్ సేవలు,104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి, ల్యాబ్ సేవలు,108 అత్యవసర సేవలు, నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల పర్యవేక్షణ, తల్లి-శిశు ఆరోగ్య సేవలు వంటి అన్ని వైద్య సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత వైద్య సేవలు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, రిమోట్ కేర్, డిజిటల్ నర్వ్ సెంటర్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ప్రజల్లో జీవనశైలిపై అవగాహన కూడా అవసరమని సీఎం అన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ,అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం,తల్లికి వందనం,స్త్రీశక్తి, దీపం--2.0, ప్రతి ఇంటికి సౌర విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే ప్రక్రియను బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో చేపడుతున్నామని, ప్రతి నెల 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తిచేసి ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు చేపడుతున్నామని, రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కర్నూలు జిల్లాలో రూ.1,768 కోట్లతో వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పూర్తి చేసి సాగునీరు అందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని వెల్లడించారు.2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన సీఎం, అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కర్నూలు--బళ్లారి రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు.చివరగా, సంజీవని ద్వారా ప్రతి పౌరుడి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుందని, ఈ ప్రాజెక్టును సమర్థంగా వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు..

# కళల కాణాచి భారత దేశం

**- భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు - శిల్పకళావేదికలో అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు ప్రారంభం - అద్భుతం స్వాతి సోమనాధ్ బృందం కామసూత్ర నృత్య నాటకం - ఘనంగా నల్లాన్ చక్రవర్థుల మూర్తి, అలేఖ్య పుంజాల, కౌశికి చక్రవర్తి లకు విపంచి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం**



**హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్):** భారత శాస్త్రీయ సంగీత నృత్య కళలే ప్రపంచానికి ఆదర్శనీయంగా ఆకర్షిస్తున్నాయని, భారత దేశం కళల కాణాచి అని భారత పూర్వ రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. భారతీయ మూలాలు మరచిపోకుండా సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శనివారం శిల్పకళావేదికలో విపంచి సంస్థ పదవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అంతర్జాతీయ భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును ముఖ్య అతిధి ఎం.వెంకయ్య నాయుడు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. దివంగత గాయని ఎస్. జానకి చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షిస్తూ పరివ్యాప్తి చేస్తున్న విపంచి సంస్థను ఆయన అభినందించారు. భారతీయ కళలు కేవలం మానసిక ఉల్లాసాన్ని స్వాంతనను మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని విలువలు సంస్కృతి సంప్రదాయాలను నేర్పిస్తాయని, గురు పరంపర కొనసాగిస్తూ పిల్లలకు కుటుంబ వ్యవస్థ పట్ల గౌరవం పెంపొందించాలని కోరారు. భారత దేశం ఒకప్పుడు ప్రపంచానికి విశ్వ గురువు అని, బ్రిటిష్ వారి దండయాత్ర తరువాత మన మూలాలు సంస్కృతి మరచిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ అంటే మతం కాదని, అది భారతీయ జీవన విధానమని, కానీ నేటి రాజకీయం ఆ అర్థాన్నే మార్చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కళల పట్ల అభిరుచి పెంపొందించుకుని లోతైన అధ్యయనం చేసి సమాజానికి అందించాలని కోరారు. విశిష్ఠ అతిధిగా విచ్చేసిన ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయని, యువతకు సరైన దిశా నిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళా వికాసంతో సమాజభివృద్ధి జరుగుతుందని శాంతి సౌభాగ్యం వెల్లివిరుస్తుందని, సాంస్కృతిక వైభవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విపంచి పదేళ్ల ప్రస్థానం ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన విపంచి అధ్యక్షులు, మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని మాట్లాడుతూ భారతీయ కళా శక్తి మహత్తరం అని, సంగీత నృత్య మధురిమల గురించి చర్చించి యువతకు సరికొత్త స్ఫూర్తిని అందించేందుకు అంతర్జాతీయ స్థాయిలో సదస్సు ఏర్పాటు చేశామని, తొలి రోజు సదస్సును గాయని ఎస్.జానకికి అంకితం చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర తెలుగు సంఘం చైర్మన్ పుచ్చా వెంకటరమణ, కాట్రగడ్డ రాజగోపాలరావు, కాంటినెంటల్ కాఫీ ఎండి చల్లా రాజేంద్రప్రసాద్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్. పి. భారతి, డా. శైలజ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కె. హరిబాబును తెలుగు వెలుగులు పురస్కారంతో సన్మానించారు. కర్ణాటక సంగీత కళానిధి డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల మూర్తి, ప్రఖ్యాత హిందూస్థాని శాస్త్రీయ గాయని డాక్టర్ కౌశికి చక్రవర్తి, ప్రముఖ కూచిపూడి నర్తకీమణి ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల లను విపంచి జీవన సాఫల్య పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. సంగీత నృత్య అభినయ ఉపన్యాస సదస్సులో సెంట్రల్ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య డాక్టర్ అనూరాధ జొన్నలగడ్డ, సితార విద్వాంసురాలు డాక్టర్ అనుపమ భగవత్, సంగీత దర్శకులు డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం, పద్మశ్రీ దీపికారెడ్డి, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ అయ్యగారి శ్యామ సుందర్, వయోలిన్ డాక్టర్ అశోక్ గుర్జాలే, డాక్టర్ రాఘవాచారి, డాక్టర్ రాజ్యలక్ష్మి సేథ్, డాక్టర్ రమాప్రభ యర్రమిల్లి తదితర ప్రముఖులు పాల్గొని వివిధ సంగీత నృత్య అంశాలపై మాట్లాడారు. కళాపోషకులు మండవ ఆశాప్రియ, పద్మప్రియ కాసరనేని, లయన్ టి.పద్మావతి పాల్గొన్నారు. తొలిరోజు సదస్సులో 'కామసూత్ర' నృత్య నాటకం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ప్రముఖ నాట్య గురు డాక్టర్ స్వాతి సోమనాథ్ (శ్రీకాకుళం) "సంప్రదాయం" శిష్య బృందం రచయిత బ్నిమ్ రచించిన కామసూత్ర నృత్య రూపకం అద్భుతంగా ప్రదర్శించారు. కాట్రగడ్డ హిమాన్షి, పద్మప్రియ అశాప్రియ నృత్య ప్రదర్శనలు, బెంగళూరుకు చెందిన అనుపమ భగవత్ సితార్ నాదం, పద్మజా విశ్వాస్ బృందం జానపద సంగీత ప్రదర్శనలు అలరించాయి. డాక్టర్ గాయత్రి రావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, విపంచి అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని పర్యవేక్షించారు.




# మోదీ దిగిపోయే సమయం వచ్చింది

(1వ పేజీ తరువాయి)

అయినా దేశ విద్యావ్యవస్థను పునర్నిర్మించుకునే దిశగా పెద్ద అడుగు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం కోసం దేశ భవిష్యత్తు కోసం ధైర్యంగా నిలబడి పోరాడారని విద్యార్థులను అభినందించారు. అణచివేత, ఒత్తిళ్ల మధ్య కూడా వారు వెనక్కి తగ్గకుండా నిలబడటం గొప్ప విషయమన్నారు. విద్యార్థులపై దాడి చేసినవారిపై చర్యలు చేపట్టడం, విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పడమనే రెండు డిమాండ్లు పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు. విద్యార్థులపై హింసకు, పెల్లెట్ గన్స్ వంటి ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షానే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. "విద్యార్థుల ఉద్యమం బీజేపీ-ఆర్ఎసఎసలకు గట్టి హెచ్చరిక. దేశాన్ని సొంత జాగీరులా పాలించాలనే ధోరణిని ప్రజలు సహించరు. అలా చేస్తే ఇప్పటి ఆందోళన కంటే పది రెట్లు పెద్ద స్థాయిలో ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒకప్పుడు భారత విద్యా వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. కానీ ఇప్పుడు దానిపై దాడి జరుగుతోంది. చెదపురుగులు చెక్కను లోపలి నుంచి తొలిచేసినట్టు ఆర్ఎ?సఎస్ మన దేశ విద్యావ్యవస్థను తొలిచేసింది. విద్యార్థుల నిరసనలు కేవలం ప్రశ్నపత్రం లీక్‌కే పరిమితం కాదు. ప్రతిపక్షం తరఫున కూడా ప్రభుత్వానికి ఒక హెచ్చరిక.

# బడంగ్ పేట్ వినాయక మండపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ

**బాలాపూర్, జులై 25 (వన్‌నేషన్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సందర్భంగా, బడంగ్ పేట్ వినాయక మండపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విద్యార్థులు సాధించిన విజయమని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు అయినా కాంగ్రెస్ పార్టీ వారికి అండగా నిలుస్తుందని, నీట్ పేపర్ లీకేజ్ పై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్న సమయంలో వారిపై ఎన్నో దాడులకు పాల్పడ్డారని అయినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని తెలుపుతూ వారికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మద్దతుగా నిలిచారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న భారతీయ జనతా పార్టీ తన వైఖరి మార్చుకోవాలంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాని ఖండిస్తూ, కేంద్ర మంత్రి రాజీనామా కాంగ్రెస్ పార్టీ విజయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభారత్, రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, బడంగ్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ బంగారి అశోక్, మీర్పేట్ ప్రెసిడెంట్ చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ సిద్ధల శ్రీశైలం, ప్రశాంతి హిల్స్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, నాదర్గుల్ ప్రెసిడెంట్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బాలాపూర్ ప్రెసిడెంట్ శ్రీరాములు, బడంగ్ పేట్ సర్కిల్ లోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, కార్యకర్తలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ర్యాలీనీ విజయవంతం చేయడం జరిగింది.





# ఓటర్ సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలి : బోయపల్లి గోవర్ధన్ రెడ్డి





**బాలాపూర్, జులై 25 (వన్‌నేషన్):** జిహెచ్ఎంసి 57వ డివిజన్ నాదర్గుల్ పరిధిలో సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను గుర్తించి, ఫోన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన నాదర్గుల్ డివిజన్-57 అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి. సర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓ బిఎల్ఏ ల సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకుని తమ ఓటు హక్కును పదిలపరుచుకోవాలని ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

## కథా సుబ్బారం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో

# ఘనంగా నిర్వహించిన "అవిష్కరణ సభ"



**హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్):** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, పాలపిట్ట మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి శ్రీమతి నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతి మినీ హాల్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు, విమర్శకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.(కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (ఐఏఎస్) హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తుందని, మంచి రచనలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కామేశ్వరి కథలపై ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి సమగ్ర విశ్లేషణ చేశారు. రచయిత్రి డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన "కథా సుబ్బారం" గ్రంథాన్ని ఆవిష్కరించగా, శ్రీమతి నెల్లుట్ల రమాదేవి రచించిన "అభిమాననం" గ్రంథాన్ని సాహిత్య ప్రముఖులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పాజ్యోతుల శ్రీలత సుభద్రాదేవి, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ (కథా సుబ్బారం), శ్రీమతి సింగరాజు రమాదేవి, శ్రీమతి అరుణ ధూపాటిశెట్టి, శ్రీమతి రాధికాసూరి, శ్రీమతి పద్మశ్రీ చెన్నోజ్జలతో పాటు పలువురు ప్రముఖ రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొని పుస్తకాల విశిష్టత, రచయితల సాహిత్య సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాభివృద్ధికి ఇటువంటి పుస్తక ఆవిష్కరణ సభలు ఎంతో దోహదపడతాయని, కొత్త రచయితలకు ఇవి స్ఫూర్తిదాయక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో నిర్వాహకులు పాల్గొన్న అతిథులు, సాహిత్యాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాహుల్ గాంధీ కా లడాయి.... దేశ్ కే లియే బడాయి

## - టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంగారెడ్డి లో " రాహుల్ గాంధీ విక్టరీ ర్యాలీ- సంగారెడ్డి ఐబి గెస్ట్ హౌస్ నుండి పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర



**సంగారెడ్డి, జులై 25 (వన్‌నేషన్):** రాహుల్ గాంధీ పోరాటం కారణంగా దేశ ప్రజలు,విద్యార్థుల బలోపేతం అవుతారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే అందుకు ఉదాహరణ. రాహుల్ గాంధీ పోరాటం వల్లనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మోడీ ఇంటి ముందు ధర్నా చేసిన తర్వాత నే ఉద్యమం ఉధ్రుతమైంది. 12 యేళ్ల పరిపాలన అని మిఠాయిలు పంచుకున్నారు.. కానీ బీజేపీ ప్రభుత్వం వల్ల జరిగిన నీట్ పేపర్ లీక్ తప్పిదం వల్ల 14 మంది చనిపోయారు. దేశంలోని విద్యార్థుల అవస్థలు చూసి రాహుల్ గాంధీ వీధి పోరాటాలు మొదలు పెట్టారు. ప్రధాని మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి, ధర్మేంద్ర ప్రధా న్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఒత్తిడితో కేంద్ర మంత్రి గద్దె దిగిపోయారు. దేశంలోని వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ లో ఉద్యమం చేశారు. రాహుల్ గాంధీ కోట్లాడినందుకే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. దేశ ప్రజలు సుఖ శాంతులతో, భద్రత తో , క్షేమంగా ఉండాలంటే ప్రధాన మంత్రి గా రాహుల్ గాంధీ కావాలి. రాహుల్ గాంధీ ఎప్పు డూ పిలుపు ఇచ్చి నా... మా సంగారెడ్డి ప్రజలు ఆందోళన కు సిద్దం.. రాహుల్ గాంధీ చెప్పితే కార్యక్రమాలు చేయడం కాదు, రాహుల్ గాంధీ రోడ్ మీదికి వస్తె మనం రావాల్సిందే. రాహుల్ గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలకు యజమాని..ఆయనకు సమస్య రానిస్తమా. రాహుల్ గాంధీ ప్రధాన అయ్యే వరకు మన పోరాటం... మన ఆరాటం కొనసాగుతుంది. రాహుల్ గాంధీ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు అందరం సిద్ధంగా ఉంటాం. ధర్మేంద్ర ప్రధా న్ రాజీనామా చేయడం బీజేపీ కి ఒక గుణపాఠం.

# ప్రజలు సేవాభావాన్ని పెంచుకోవాలి

## సామాజికవేత్త బిజెపి నాయకుడు శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్):** ప్రజలు కుల మత ప్రాంత రాజకీయ పార్టీలకు అతీతంగా సేవా భావం పెంచుకోవాలని అప్పుడే సమాజంలో ప్రజలందరూ ఐకమత్యంతో సంతోషంతో జీవిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని సామాజికవేత్త బిజెపి సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ మరియు ప్రతినిధి బృందం కూకట్పల్లిలోని శ్రీనివాస్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాతృ ప్రేమ యొక్క గొప్పతనాన్ని ప్రచారం చేస్తున్న మాతృదేవోభవ సత్సంగ్ సభ్యులను అభినందించారు ముఖ్యంగా యువత మాతృ ప్రేమ యొక్క గొప్పతనాన్ని తెలుసుకోవాలని మాతృ ప్రేమతో కుటుంబంలోనే కాదు సమాజంలో సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు మాతృదేవోభవ సత్సంగ్ చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు కార్యక్రమంలో సామాజిక వేత్త పూర్వ పోలీసు అధికారి శ్రీమతి ప్రేమ రెడ్డి దంపతులు సత్సంగ్ సభ్యులు రామ్ చందర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటానికి కేంద్రం దిగొచ్చింది

(1వ పేజీ తరువాయి)

రుజువు చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, బీజేపీయేతర రాజకీయ పక్షాలన్నీ చేసిన పోరాటం ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే.. యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించిందని అన్నారు. కాగా, ఇన్నాళ్లు ప్రజా వ్యతిరేకతను లెక్కచేయని మోదీ ప్రభుత్వం తొలిసారిగా విద్యార్థుల శక్తి ముందు తలవంచిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం న్యూఢిల్లీలో అన్నారు. 2014 తర్వాత బీజేపీ రాజకీయ చరిత్రలో ఓ మంత్రి రాజీనామా చేయడం, ప్రధాని మోదీ స్వయంగా విద్యార్థులకు విజ్ఞప్తి చేయడం, ప్రభుత్వం తక్షణమే విద్యా వ్యవస్థలో సంస్కరణలకు ఉపక్రమించడం యువత పోరాట ఫలితాలేనని స్పష్టం చేశారు. కాక్రోచ్ రూపంలో యువత చేపట్టిన ఉద్యమం బీజేపీ అబద్ధాలకు, అహంభావానికి గుణపాఠం చెప్పిందని సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఉద్యమం, ప్రజాస్వామ్యం గెలిచాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ సీపీఐ పిలుపునిచ్చిన ఆందోళనలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. నయా ఫాసిస్టు మోదీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై యువత, విద్యార్థులు చారిత్రక విజయం సాధించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత పోరాటపటిమతో సాధించిన విజయమని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

# ఎమ్మిగనూరు సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చంద్రబాబుకు ఎమ్మెల్యే డా.బి.వి.జయనాగేశ్వర రెడ్డి వినతి



**ఎమ్మిగనూరు, జులై 25 (వన్‌నేషన్):** కర్నూలు జిల్లా ఆస్పరిలో శనివారం నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా.బి.వి. జయనాగేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ రైతుల ప్రయోజనాలకు సంబంధించిన కీలక సాగునీటి ప్రాజెక్టులపై వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గంలో సాగునీటి అవసరాలు,రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.వినతిపత్రంలో ముఖ్యంగా గురు రాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు ప్రత్యేక మరమ్మతులు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు పరిపాలనా అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కుడి కాలువ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించి,పనులను వేగవంతం చేయాలని కోరారు.అదేవిధంగా గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్య పెంపు పనులకు సంబంధించిన మెకానికల్ కంపోనెంట్ బిల్లులను తక్షణమే ప్రాసెస్ చేసి విడుదల చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ పనులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతిపత్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని ఆదేశిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతుల సంక్షేమం,సాగునీటి భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రైతాంగ అభివృద్ధికి అవసరమైన ప్రతి ప్రాజెక్టును పూర్తి చేయించే వరకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ నిరంతరం కృషి కొనసాగిస్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు.



హైదరాబాద్, జులై 25 (వన్‌నేషన్): నెక్లెస్ రోడ్ లో 100 సంవత్సరాల ఇండియన్ ఫైర్ వర్క్స్ సందర్భంగా టపాకాయలు సందడి . - ఎస్. శ్రీధర్

# ఘనంగా 167వ ఆదాయపు పన్ను దినోత్సవం

(1వ పేజీ తరువాయి)

విస్తృతంగా వినియోగిస్తామని తెలిపారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో నిజాయితీగా పన్నులు చెల్లించే పౌరులు, ఆదాయపు పన్ను శాఖ కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛంద పన్ను చెల్లింపులు, పారదర్శకత, డిజిటల్ పాలన, పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన సేవలు దేశాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

గౌరవ అతిథి కె.వి. చౌదరి మాట్లాడుతూ, ఆదాయపు పన్ను శాఖ సాంకేతిక విప్లవాత్మక మార్పులతో పన్ను చెల్లింపుదారులకు సేవలను మరింత సులభతరం చేసిందన్నారు. పాన్ కార్డుల జారీ, ఆదాయపు పన్ను రీఫండ్‌ల వేగవంతమైన ప్రాసెసింగ్, ప్రీ-ఫిల్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్లు వంటి సంస్కరణలను అభినందించారు. అప్పీళ్ల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శాఖలో విశేష ప్రతిభ కనబరిచిన 12 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వినూత్న ఆలోచనల ద్వారా పన్ను వసూళ్ల పెంపునకు దోహదపడినందుకు ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్--1, హైదరాబాద్ కార్యాలయానికి "చాంపియన్స్ ఐడియా ట్రోఫీ" ప్రదానం చేశారు. అలాగే గవర్నర్ "ట్యాక్స్ స్పార్క్ (ऱाऱ ऱ्राग=ख)" మాసపత్రికను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్--తెలంగాణ ప్రాంత ఆదాయపు పన్ను శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, విజయాలు, వినూత్న కార్యక్రమాలు, అధికారుల సృజనాత్మక రచనలకు ఈ పత్రిక వేదికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, పన్ను నిపుణులు, న్యాయవాదులు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో స్వచ్ఛంద పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తూ, పారదర్శకమైన, ప్రజా అనుకూల సేవలను మరింత విస్తరించేందుకు ఆదాయపు పన్ను శాఖ కట్టుబడి ఉందని అధికారులు పునరుద్ఘాటించారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**